

## ఆకట్టుకున్న రాష్ట్ర శకటం

- గీతంలో గల్లంతైన నెహ్రూ పేరు

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగిన శకటాల ప్రదర్శనలో తెలంగాణ శకటం ఆకట్టుకుంది. ప్రజాస్వామ్య భావన పరిఢవిల్లుతున్నదనే కోణంలో దీనిని రూపొందించారు. ఈసారి తెలంగాణ శకటానికి అవకాశం లేకపోయినప్పటికీ, తాను మాట్లాడిన తరువాత అవకాశం ఇచ్చారని సీఎం గత ఢిల్లీ పర్యటన తరువాత చెప్పారు. అయితే, తెలంగాణ శకటంతోపాటు వినిపించిన గీతంలో నెహ్రూ పేరు రాకపోవడంతో తెలంగాణవాసులు ఆశ్చర్యానికి లోనయ్యారు. గాంధీ, పటేల్, సుభాష్ చంద్రబోసులు.. రాంజీ గోండు, కుమ్రం భీం, వీరనారి ఐలమ్మలు అంటూ సాగిన గీతంలో నెహ్రూను స్మరించుకోలేదు. నెహ్రూ పేరును మరిచిపోయారా.. లేక కావాలని చేర్చలేదా అని చర్చనీయాంశం అయ్యింది.



హైకోర్టులో జెండా ఆవిష్కరించి, సెల్యూట్ చేస్తున్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

## నేటి నుంచి 4 జిల్లా కోర్టుల్లో ఈ-ఫైలింగ్

- హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని జిల్లా కోర్టులను కాగితరహితం (పేపర్‌లెస్)గా మార్చనున్నట్టు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రకటించారు. శనివారం నుంచి 4 జిల్లా కోర్టుల్లో ఈ-ఫైలింగ్ విధానం అమల్లోకి వస్తుందని.. వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జగిత్యాల కోర్టుల్లో ఈ విధానం ప్రారంభమవుతుందని వెల్లడించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైకోర్టు భవనంపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జస్టిస్ అరాధే ప్రసంగిస్తూ.. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 37 ఈ-సేవ కేంద్రాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. హైకోర్టులో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు సువిశాల ప్రాంగణం అవసరమని, అందుకే ప్రభుత్వం రాజేంద్రనగర్‌లోని బుద్వేల్‌లో 100 ఎకరాల భూమిని కేటాయించిందని చెప్పారు. గతంలో రూపొందించిన న్యాయనిర్మాణ్ డాక్యుమెంట్ ప్రకారం నూతన హైకోర్టు భవన నిర్మాణం జరుగుతుందని స్పష్టం చేశారు. న్యాయవాదుల సంక్షేమానికి హైకోర్టు కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పీ నాగేశ్వరరావు, బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నరసింహారెడ్డి, అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి, అదనపు సొలిసిటర్ జనరల్ పీ నరసింహాశర్మ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ జీ ప్రవీణ్‌కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి ఎస్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నీళ్లు లేక నెర్రెలిచ్చిన పొలం

- గోదావరి జలాలు విడుదల చేయక ఎండుతున్న పంటలు
- రైతుల ఆవేదన.. కాల్వనీరు విడుదల చేయాలని వేడుకోలు

జనగామ రూరల్, జనవరి 26: తెలంగాణ రాకముందు ఎట్లుండె మన పల్లెలు అంటే.. నెర్రెలిచ్చిన నేలలు. పాడుబడ్డ బావులు.. ఒట్టిపోయిన చెరువులు కనిపిస్తుండే. మళ్లీ అలాంటి పరిస్థితులే ఇప్పుడూ దాపురిస్తున్నాయి. పదేండ్లపాటు పండుగైన వ్యవసాయం మళ్లీ.. దండుగలా మారే పరిస్థితి రాబోతున్నది. అందుకు సాక్ష్యమే జనగామ జిల్లాలో దుస్థితి. గోదావరి జలాలు రాక, విద్యుత్తు సరఫరా సరిగా లేక రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయి. వాస్తవానికి జనగామ అంటేనే నీళ్లు లేక దుర్భిక్షంగా ఉండే ప్రాంతం. కేసీఆర్ సీఎం అయ్యాక ఈ ప్రాంతాన్ని మరో కోనసీమ చేశారు. ప్రతి మారుమూల ప్రాంతానికి గోదావరి జలాలు అందించి బీడుభూములను సైతం సాగులోకి తీసుకొచ్చారు. ప్రతి గ్రామంలోని చెరువును మిషన్ కాకతీయ ద్వారా పూడిక తీయించి వాటిల్లో కాల్వల ద్వారా గోదావరి జలాలు నింపారు. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చాక నీళ్లను విడుదల చేయకపోవటంతో రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జనగామ మండలంలోని ఎర్రకుంటతండా గ్రామంలో గతంలో దండిగా పండిన పంటలు నేడు నీరు లేక ఎండిపోతుండటంతో దిగులు పడుతున్నారు. గతంలో బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి కాల్వల ద్వారా నీరు రావటంతో పంటలు వేసుకొని నీరు పెట్టుకునేది. ఇప్పుడు కనీసం ఎకరం కూడా సక్రమంగా పారుతలేదని వాపోతున్నారు. గోదావరి జలాలను విడుదల చేసి పంటలను కాపాడాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను వేడుకుంటున్నారు.



ఎండిపోయిన పంటలను చూపుతున్న ఎర్రకుంటతండా రైతులు



ఎర్రకుంట తండాలో ఎండిపోయిన బావి

### పదెకరాలు పడావుగా ఉన్నది



నాకు 15 ఎకరాలు ఉన్నది. నీరు లేక ఐదెకరాలు నాటు పెట్టిన. మిగతాది పడావుగా ఉన్నది. అది కూడా పారుతాలేదు. గతంలో కాల్వల ద్వారా నీరు వచ్చేది. దాంతో పంటలు పండేటివి. ఇప్పుడు నీరు రాకపోవటంతో వేసిన పంట కూడా ఎండిపోయింది. మేము ఎట్లా బతకాలి? అధికారులు మా బాధను పట్టించుకొని నీటిని విడుదల చేసి పంటలకు జీవం పోయాలి.

- మాలోత్ సక్రు, రైతు ఎర్రకుంట తండా, జనగామ

### రెండెకరాలు కూడా పారుతలేదు



నాకు 5ఎకరాలు ఉన్నది. కానీ, నీళ్లు లేక రెండు ఎకరాల్లోనే నాటువేసిన. అది కూడా సక్రమంగా పారుతలేదు. ఇప్పటికే పంట ఎండిపోవడంతో గోదావరి నీరు వస్తే కొద్దోగొప్పో పంట చేతికి వస్తుందని ఆశ మీద ఉన్న. గతంలో కాల్వ ద్వారా గోదావరి నీరు రావటంతో పంటలకు సరిపోయేది. ఇప్పుడు బోరుబావుల్లో కూడా నీరు అడుగంటిపోయింది. పంటలకు పెట్టుబడి రాకపోతే అప్పుల పాలై ఆత్మహత్యే శరణ్యం.

- గుగులోత్ కొమురయ్య, రైతు ఎర్రకుంట తండా, జనగామ మండలం



నీరు లేక బోసిపోతున్న కాల్వ

### వ్యవసాయ విద్యార్థులకు సంఘీభావం




వ్యవసాయ విశ్వవిద్యాలయ భూములను హైకోర్టుకు కేటాయించవద్దంటూ శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థుల పట్ల పోలీసులు కర్కశంగా ప్రవర్తించడాన్ని, ఝాన్సీ అనే విద్యార్థినిని జుట్టు పట్టి ఈడ్చుకెళ్లడాన్ని హైకోర్టు పరిరక్షణ సమితి ఖండించింది. వర్సిటీ భూముల పరిరక్షణ కోసం కృషిచేస్తున్న విద్యార్థులకు సమితి నాయకులు గుండ్రాతి శారదాగౌడ్, మామిడి వేణుమాధవ్, వెంకటేశ్వరప్రసాద్, మణికంఠ, బర్ల మల్లేశ్ యాదవ్, కృష్ణముదిరాజ్, రమేశ్ మాదిగ తదితరులు సంఘీభావం ప్రకటించారు.



గవర్నర్ తమిళిసైకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

## ఆరు గ్యారెంటీల అమలు వందరోజుల్లో

మొదటిపేజీ తరువాయి...

ప్రతి పేదవాడికి అందుతాయని అన్నారు. అభివృద్ధిలో తెలంగాణ ప్రపంచంతో పోటీ పడేలా, సంక్షేమంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించేలా రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పట్టుదలతో ముందుకు సాగాలని చెప్పారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా త్వరలోనే ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రక్రియ మొదలవుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో యువత ఎలాంటి అనుమానాలు, అపోహలకు లోను కావాల్సిన అవసరం లేదన్నారు. దావోస్‌కు వెళ్లి భారీ స్థాయిలో పెట్టుబడులు తీసుకొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి బృందాన్ని అభినందించారు. ప్రజల హక్కులను, స్వేచ్ఛను గౌరవించే పాలన తెలంగాణలో ఉంది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ గౌడ్, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, నగర కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, పలువురు న్యాయమూర్తులు, ఇతర ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ జెండా ఆవిష్కరించిన సీఎం

- సైనిక స్మారకం వద్ద యుద్ధవీరులకు నివాళి
- పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన గణతంత్ర వేడుకలకు హాజరు
- స్పీకర్ గడ్డం ప్రసాద్, సీపీఎం నేత తమ్మినేనికి పరామర్శ

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నివాసంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌కు చేరుకొన్న సీఎం.. అక్కడ సైనిక్ వీరుల స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి యుద్ధవీరులకు నివాళి అర్పించారు. తర్వాత నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు. గవర్నర్ తమిళిసైకి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు, న్యాయాధిపతులు, పలువురు స్వాతంత్ర సమరయోధులు పాల్గొన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన స్పీకర్ గడ్డం ప్రసాద్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రాన్ని సీఎం పరామర్శించారు.

## సందడిగా ఎట్ హోం

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): గణతంత్ర వేడుకల్లో భాగంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమం సందడిగా జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. బీజేపీ నుంచి రాకేశ్‌రెడ్డి మినహా మిగతా ఎమ్మెల్యేలు హాజరుకాలేదు. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్సీలు బండ ప్రకాశ్, గోరటి వెంకన్న మాత్రమే హాజరయ్యారు.

# నేడు కొండపల్లి శేషగిరిరావు జయంతి

- జేఎన్‌ఏఎఫ్‌ఏయూలో శతజయంతి వేడుకలు ప్రారంభం
- ఆయనను స్మరిస్తూ ఏడాది మొత్తం కార్యక్రమాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 26 (నమస్తే తెలంగాణ): భారతీయ చిత్రకళకు ఊపిరినిచ్చిన ప్రఖ్యాత చిత్రకారుడు డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు జయంతిని పురస్కరించుకొని ఈ ఏడాది మొత్తం శతజయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం మాసబ్‌ట్యాంక్ జేఎన్‌ఏఎఫ్‌ఏయూ కళాశాల ప్రాంగణంలో శేషగిరిరావు శత జయంతి వేడుకలను ప్రారంభించనున్నారు. శేషగిరిరావు కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో పనిచేసిన సమయంలో 'ఆనంద్ గడప, నిర్మల బిలుక' ఇంగ్లిషులో రచించిన పుస్తకాన్ని జేఎన్‌ఏఎఫ్‌ఏయూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కవిత ధర్యానిరావు, ఎమ్మెల్సీ సురభి వాణిదేవీలు ఆవిష్కరించనున్నారు. చిత్రకళా విభాగంలో అకడమిక్‌లో ఫస్ట్‌క్లాస్ తెచ్చుకున్న విద్యార్థికి 'కొండపల్లి ఎక్సలెన్సీ' అవార్డును ఆయన కుటుంబ సభ్యులు అందజేయనున్నారు. రెండు రోజుల క్రితం ఫైనార్ట్స్ విద్యార్థులు ముగ్గుల పోటీ నిర్వహించగా.. అందులో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులను ఇదే వేదికగా ఇవ్వనున్నారు.



శేషగిరిరావు కుంచెలోంచి జాలువారిన అద్భుత చిత్రం



### చిత్రకళా రత్న కొండపల్లి

దేశం గర్వించదగ్గ చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావు తెలంగాణ బిడ్డ. 1924 జనవరి 27న ఉమ్మడి వరంగల్ జిల్లా మహబూబాబాద్ సమీపంలోని పెనుగొండ గ్రామంలో శేషగిరిరావు జన్మించారు. బాల్యం నుంచే చిత్రకళపై మక్కువ పెంచుకున్నారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం, రాజస్థాన్‌లోని బనస్థలి విద్యాపీఠ్, హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్‌లో విద్యనభ్యసించారు. కలకత్తాలోని విశ్వభారతి శాంతినికేతన్‌లో నందలాల్ బోసు శిక్షణలో తన కళకు మెరుగులు దిద్దుకున్నారు. ప్రకృతి చిత్రాలు వేసినా.. పురాణాల కథాంశాలతో బొమ్మలు దించినా శేషగిరిరావు బొమ్మల రారాజు అని, చిత్రకళా పండితుడని పేరుగాంచారు. హైదరాబాద్‌లోని ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో 40 ఏండ్లు లెక్చరర్‌గా ఉద్యోగం చేసి, ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ పొందారు. తెలుగు విశ్వ విద్యాలయం శేషగిరిరావుకు డాక్టరేట్ ప్రదానం చేసింది. 2012 జులై 26న శేషగిరిరావు కన్నుమూశారు.

## 231 మంది ఖైదీలు విడుదలకు సిద్ధం

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా వివిధ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న 231 మంది ఖైదీల విడుదలకు రంగం సిద్ధమైంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు గవర్నర్ తమిళిసై సిఫారసు మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొన్నది. వారిలో 212 మంది జీవితకాల శిక్ష అనుభవిస్తున్నవారు, మరో 19 మంది ఇతర శిక్షను అనుభవిస్తున్నారు. ఏటా గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవాలు, గాంధీ జయంతి సందర్భంగా గవర్నర్ విశిష్ట అధికారాల(ఆర్టికల్ 161) మేరకు సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేస్తుంటారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2016, 2020లో మాత్రమే ఖైదీలను విడుదల చేశారు. మూడేండ్ల తర్వాత మళ్లీ గవర్నర్ సిఫారసు చేశారు.

## చందనవెల్లి భూమి అవకతవకలపై విచారణ

- బాధితులకు డిప్యూటీ సీఎం హామీ

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 26 (నమస్తే తెలంగాణ): చందనవెల్లిలో చేపట్టిన భూసేకరణ సందర్భంగా చోటు చేసుకున్న అవకతవకలపై విచారణ జరిపిస్తామని, నిజమైన లబ్ధిదారులకు పరిహారం అందేలా చూస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని చందనవెల్లి పరిధిలో శుక్రవారం జున్నా సోలార్‌పవర్ ప్లాంట్ ప్రారంభానికి వచ్చిన ఉపముఖ్యమంత్రిని భూ బాధితులు కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందనవెల్లి గ్రామ సర్వే నంబర్ 190లో చేపట్టిన భూసేకరణలో నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఎంజాయ్‌మెంట్ సర్వే పేరిట భూమి లేని వారి పేర్లను చేర్చి నిజమైన రైతులకు పరిహారం ఇవ్వలేదని అన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు తాను చేపట్టిన పాదయాత్ర సందర్భంగా ఈ గ్రామానికి వచ్చినప్పుడు సైతం బాధితులు తన దృష్టికి ఈ సమస్యను తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఎంజాయ్‌మెంట్ సర్వే పేరిట రికార్డుల్లో లేని వారి పేర్లను చేర్చి భూసేకరణ పరిహారం అర్హులకు రాకుండా బోగస్ లబ్ధిదారులు తీసుకున్నారని, దీనిపై సమగ్రవిచారణ చేయిస్తానని వెల్లడించారు. స్థానికంగా ఏర్పాటుచేసిన పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా పరిశ్రమలు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని భట్టి హెచ్చరించారు.

## మెరుగైన టూరిజం పాలసీని రూపొందిస్తాం

- స్పెయిన్‌లో మంత్రి జూపల్లి



హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు మెరుగైన పాలసీని రూపొందిస్తామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అంతర్జాతీయ టూరిజం ట్రేడ్ ఫెయిర్ సందర్భంగా మంత్రి స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటకానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు.

# ఏపీలో ప్రచారానికి తెలంగాణ మంత్రులు


- లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ప్రచారం

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున తెలంగాణ రాష్ట్ర మంత్రులు, ముఖ్య నేతలను ప్రచారం చేయించాలని ఆ పార్టీ అధిష్ఠానం భావిస్తున్నది. ఫిబ్రవరి 15 తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ రావొచ్చన్న నేపథ్యంలో ఆ పార్టీ ముందస్తు ప్రచారానికి దిగేందుకు సిద్ధమైంది. తెలంగాణలో గెలుపు, ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల నియామకం వంటివి పార్టీని ఏపీలో బలోపేతం చేస్తాయని కాంగ్రెస్ భావిస్తున్నది. ఈ నేపథ్యంలో తెలంగాణ మంత్రులు, సీనియర్ నాయకుల సేవలను వాడుకోవాలని నిర్ణయించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రులుగా చేసిన అనుభవం ఉన్న నేతలతో ఏపీలో ప్రచారం చేయించనున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని పాత తరం నేతలు, కార్యకర్తలు, అభిమానుల్లో వారికి ఉన్న గుర్తింపు ఉపయోగపడుతుందని ఢిల్లీ పెద్దలు భావిస్తున్నారు. నోటిఫికేషన్ తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్నికలు ఒకేసారి వస్తే మొదటి వారంలోనే తెలంగాణ నేతల సేవలను వినియోగించుకోవాలని, వేర్వేరు దశల్లో వస్తే పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డిని స్టార్ క్యాంపెనర్‌గా ఇతర రాష్ర్టాల్లో ప్రచారం చేయించాలని కాంగ్రెస్ భావిస్తున్నది. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్‌లో రేవంత్‌రెడ్డితో ప్రచారం చేయించే అవకాశాలు ఉన్నాయి.

### త్వరలో ఏపీకి మంత్రి కొండా సురేఖ

రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ త్వరలో ఏపీలో పర్యటిస్తారని సమాచారం. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులతో ఆమె భేటీ అవుతారని తెలిసింది. తెలంగాణ ప్రభుత్వానికి, టీటీడీకి మధ్య సంబంధాలను బలోపేతం చేయడంపై ఆమె దృష్టి పెట్టినట్టు తెలిసింది.

### 100 మీటర్ల జాతీయ పతాకం ప్రదర్శన



గణతంత్ర దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని కాంటా చౌరస్తా వద్ద శుక్రవారం జనహిత సేవా సమితి, వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో నిత్య జనగణమన జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించారు. అంతకుముందు బజార్ ఏరియాలో 100 మీటర్ల జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. - బెల్లంపల్లి

### ఫిరంగిపై కాంగ్రెస్ జెండా..



గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశభక్తిని చాటేలా మంచిర్యాల జిల్లాకేంద్రంలోని ఓ చౌరస్తాలో ఏర్పాటుచేసిన ఫిరంగిపై శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కాంగ్రెస్ జెండాను కప్పి వెళ్లిపోయారు. జాతీయ జెండాకు బదులు కాంగ్రెస్ జెండా కప్పడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. - మంచిర్యాల అర్బన్